క్లుప్తంగా

పంటకోత ప్రయోగాలపై శిక్షణ



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎ.డి శ్యామ్‌సుందర్

బొబ్బిలి రూరల్: వరి పంటల్లో కోత ప్రయోగాలు, దిగుబడి లెక్కింపు, బీమా వర్తింపు, తదితర అంశాలపై శుక్రవారం స్థానిక రైతు సేవా కేంద్రంలో సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ ఎ.డి శ్యామ్‌సుందర్ మాట్లాడుతూ, సిబ్బందికి అన్ని అంశాలపై అవగాహన ఉన్నప్పుడే లక్ష్యాలను చేరుకోగలమన్నారు. పంట నష్టం నమోదు, దిగుబడి వివరాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ రైతులకు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్‌ఓ మీసాలబాబు, ఏఎస్‌ఓ, 22 రైతుసేవా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

ఫిజియోథెరపీతో వైకల్యం నయం



చిన్నారికి ఫిజియోథెరపీ చేస్తున్న వైద్యుడు

బాడంగి: దివ్యాంగ చిన్నారులకు క్రమం తప్పకుండా ఫిజియోథెరపీ చేయడం వల్ల వైకల్యం తగ్గించవచ్చని ఫిజియోథెరపిస్టులు తెలిపారు. శుక్రవారం స్థానిక భవిత కేంద్రంలో ఫిజియోథెరపీ శిబిరం నిర్వహించారు. సుమారు 12 మంది చిన్నారులకు సేవలు అందించినట్లు ఎంఆర్‌టీ సత్యనారాయణమూర్తి తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓలు లక్ష్మణదొర, రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం

- ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు



వైద్యాధికారి దిలీప్‌కుమార్‌తో మాట్లాడుతున్న ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు

రామభద్రపురం: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు అన్నారు. మండల కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో వైద్యాధికారి దిలీప్‌కుమార్‌తో శుక్రవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజారోగ్య రక్షణే ధ్యేయంగా చర్యలు చేపట్టాలన్నారు. ఇటీవల కురిసిన అధిక వర్షాల కారణంగా ప్రజలు డయేరియా, మలేరియా, టైఫాయిడ్, డెంగీ వంటి విషజ్వరాల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. గ్రామాలలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు.

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి

రాజాం సిటీ: విద్యార్థులు క్రమశిక్షణతో మెలగడంతోపాటు తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా నడుచుకోవాలని ఎస్సై ఆర్.నర్సింహమూర్తి అన్నారు. సంకల్పం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక ఆదిత్య జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మత్తుపదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. చెడు వ్యసనాలకు బానిసకాకుండా సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. జీవిత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించేందుకు ప్రణాళికతో కృషిచేయాలన్నారు.

బీజామృతంతో విత్తనశుద్ధి

రేగిడి: మండలంలో ఉప్పర్నాయుడువలస గ్రామంలో శుక్రవారం బీజామృతం తయారీపై ప్రకృతి వ్యవసాయ విభాగం ఎల్2 గౌరీశ్వరరావు, ఐసీఆర్‌పీలు పైల తవిటినాయుడు, రమణ, గోవిందమ్మ రైతులకు అవగాహన కల్పించారు. బీజామృతంతో విత్తనాలు శుద్ధి చేయడం ద్వారా చీడపీడల వ్యాప్తిని నివారించవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటలు సాగు చేసేందుకు రైతులు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ కరణం గోవిందరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో నిబంధనలు పాటించాలి

సంతకవిటి/రాజాం సిటీ: సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో నిబంధనలు పాటించాలని సీనియర్ సివిల్ జడ్జి సీహెచ్ వివేక్ ఆనంద్ శ్రీనివాస్ అన్నారు. సంతకవిటి మండల కేంద్రంలోని బీసీ వెల్ఫేర్ హాస్టల్‌ను, వాసుదేవపట్నం కేజీబీవీని, రాజాం పట్టణంలోని పలు వసతిగృహాలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహాలలోని గదులను, వంటగదిని, స్టోర్‌రూంను, వండిన వంటలను, రోజువారీ అందిస్తున్న మెనూను పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న తాగునీటి వనరులు, వైద్యసేవలు, పరిసరాల పరిశుభ్రతపై ఆరాతీశారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధతీసుకోవాలని హాస్టల్ నిర్వాహకులకు సూచించారు. ఆయన వెంట ప్రభుత్వ న్యాయవాది ఎస్.పోలారావు, బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ ఆర్.ఈ.సి.హెచ్ జయదేవ్, సెక్రటరీ వై.ఈశ్వరరావు, కేజీబీవీ ఎస్‌ఓ అలుగోలు ప్రభ, సంతకవిటి పోలీస్ సిబ్బంది ఉన్నారు.

అన్న క్యాంటీన్‌లో..
ఆరంభంలోనే ఆకలికేకలు



రాజాం అన్న క్యాంటీన్ వద్ద భోజనాల కోసం ఎండలో నిరీక్షిస్తున్న ప్రజలు

రాజాం: పట్టణంలో బస్టాండ్ వద్ద వారం రోజులు క్రితం ప్రారంభించిన అన్న క్యాంటీన్ వద్ద ఆకలికేకలు ప్రారంభం అయ్యాయి. గత రెండురోజులుగా ఈ క్యాంటీన్‌లో మధ్యాహ్న భోజన సమయంలో సమయపాలనలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. వివిధ పనులపై పట్టణానికి వచ్చినవారితో పాటు పట్టణంలో ఉంటున్న యాచకులు ఎక్కువగా ఈ అన్న క్యాంటీన్‌ను ఆశ్రయిస్తున్నారు. శుక్రవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి కొంతమంది భోజనాల కోసం ఎదురుచూడగా, ఒంటి గంటవరకూ టోకెన్లు ఇవ్వలేదు. దీంతో భోజనాల కోసం వచ్చిన వారంతా ఇబ్బందులు పడ్డారు. మరోవైపు టోకెన్లు తీసుకుని లోపలకు వెళ్లినవారికి వడ్డించాల్సిన పరిమాణం కంటే తక్కువ అన్నం, సాంబారులో నీరు కలిపి పెడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. చాలీచాలని అన్నంతో కడుపునిండుతుందా అని వడ్డిస్తున్నవారిని ప్రశ్నిస్తున్నారు. దీనిపై నిలదీస్తున్న కొంతమందిని క్యాంటీన్ నిర్వాహకులు లోపలకు రానీయకుండా అడ్డుకోవడం, వారితో దురుసుగా ప్రవర్తించడం చేశారు. దీంతో ఈ క్యాంటీన్ నిర్వహణపై విమర్శలు ప్రారంభమయ్యాయి. ప్రచారం ఎక్కువ, పనితీరు తక్కువ అంటూ అక్కడకు వచ్చిన కొంతమంది విసుగు వెల్లగక్కారు. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు వద్ద సాక్షి ప్రస్తావించగా, అన్నా క్యాంటీన్ నిర్వహణపై ఆరాతీస్తామని, ప్రజలకు సక్రమంగా భోజనం అందేలా చూస్తామన్నారు.



చాలీచాలని భోజనం



భోజన మెనూపై ప్రశ్నిస్తున్న వారిని బయటకు తోసేస్తున్న క్యాంటీన్ సిబ్బంది

'పల్లె పండుగ'తో గ్రామాల్లో అభివృద్ధి

- ఎంపీడీఓ రేగి రాంబాబు



తెర్లాం: తెర్లాంలో అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తున్న సర్పంచ్ రూప, ఎంపీడీఓ రాంబాబు

తెర్లాం: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న పల్లె పండుగ కార్యక్రమం ద్వారా గ్రామాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ఎంపీడీఓ రేగి రాంబాబు అన్నారు. తెర్లాం గ్రామంలో సర్పంచ్ బోనెల రూప ఆధ్వర్యంలో శుక్రవారం పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. అనంతరం ఎంపీడీఓ రాంబాబు మాట్లాడుతూ, గ్రామాల్లో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణాలను ఉపాధి నిధులతో చేపట్టనున్నట్లు చెప్పారు. అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు జి.ఆనందరావు, టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి ఎస్.వెంకటేశ్వరరావు, టీడీపీ మండలాధ్యక్షుడు ఎస్.వెంకటనాయుడు, ఉపాధి ఏపీఓ సుశీల, సాంకేతిక సహాయకులు, క్షేత్ర సహాయకుడు పాల్గొన్నారు.



బొబ్బిలి రూరల్: అలజంగిలో రహదారి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు

రహదారుల నిర్మాణానికి భూమిపూజ..

బొబ్బిలి రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధిహామీ పథకం నిధులతో చేపడుతున్న సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజలు చేశారు. పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా అలజంగి, కృష్ణాపురం, కారాడ గ్రామల్లో ఎంపీడీఓ పి. రవికుమార్, స్థానిక ప్రజాప్రతినిధులు పర్యటించి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, వార్డుసభ్యులు పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరిస్తాం..

- రెవెన్యూ అధికారులు

బొబ్బిలి రూరల్: గ్రామాల్లో నెలకొన్న భూ సమస్యలను పరిష్కరించేందుకు గ్రామసభలు నిర్వహిస్తున్నామని రెవెన్యూ అధికారులు అన్నారు. మండలంలోని కారాడలో శుక్రవారం రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో జరిగిన రీసర్వేలో భూముల సరిహద్దులు, పేర్లలో తప్పులు, తదితర సమస్యలను గ్రామసభల్లో తెలియజేస్తే సరి చేస్తామన్నారు. దీంతో 15 మంది రైతులు సవరణలు కోరుతూ అర్జీలు సమర్పించారు. కార్యక్రమంలో డీటీ గర్భాపు అప్పయ్య, సర్వేయర్ డొంక సతీష్, సర్పంచ్ చొక్కాపు సంజీవినాయుడు, వైస్ సర్పంచ్ తెర్లి చంద్రశేఖర్, వీఆర్‌ఓ చిత్తరంజన్, రైతులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులు ఎంతో ఉపయోగం..

తెర్లాం: భూముల సమస్యలను పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులు దోహదపడతాయని తహసీల్దార్ జి.హేమంత్‌కుమార్ అన్నారు. మండలంలోని నెమలాం గ్రామ సచివాలయంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు హాజరైన రైతుల నుంచి భూసమస్యలపై వినతిపత్రాలు స్వీకరించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ, గతంలో జరిగిన భూముల రీసర్వేలోను, చాలా కాలంగా ఉన్న భూముల సమస్యలను పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సదస్సులో సర్పంచ్ మజ్జి నరసింహులు, మండల వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బోను అప్పలనాయుడు, వీఆర్‌ఓ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.




బాడంగి: పెదపల్లి గ్రామసభలో వివరాలు వెల్లడిస్తున్న తహసీల్దార్ సుధాకర్, వీఎస్ మాధురి

పొరపాట్లను సరిదిద్దాలి..

బాడంగి: భూములకు సంబంధించిన నమోదైన పొరపాట్లను సరిదిద్దాలని తహసీల్దార్ కె. సుధాకర్ అన్నారు. మండలంలోని పెదపల్లిలో రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భూ సంబంధిత రికార్డుల్లో ఎటువంటి తప్పొప్పులు చోటుచేసుకున్నా తెలియజేస్తే పరిష్కరిస్తామన్నారు. గ్రామసభలో రీ సర్వే డీటీ అప్పల నాయుడు, మండల సర్వేయర్ వెంకటరమణ, సర్పంచ్ ప్రతినిధి ఆవు సత్యనారాయణ, గజరాయుని వలస సర్పంచ్ సత్తిబాబు, గ్రామపెద్దలు, రైతులు పాల్గొన్నారు.

మద్యం దుకాణం తరలించాలని వినతి

రేగిడి: తమ గ్రామాల సమీపంలో మద్యం దుకాణం వద్ద దేవుదళ, పుర్లి, గోపింపేట గ్రామస్తులు అధికారులను కోరారు. ఈమేరకు శుక్రవారం దేవుదళ సచివాలయంకు చేరుకుని మహిళా పోలీస్‌కు వినతిపత్రం అందించారు. ఇటీవల ప్రభుత్వం కేటాయించిన ప్రైవేట్ మద్యం దకాణాల్లో ఒక షాపును సంకిలి సుగర్ ఫ్యాక్టరీ సమీపంలో దేవుదళ వెళ్లే రోడ్డులో ఏర్పాటుకు అధికారులు సన్నాహాలు చేశారు. విషయం తెలుసుకున్న ఆయా గ్రామాల ప్రజలు పుర్లి సర్పంచ్ ఎర్నేన సుగుణమ్మ, రామినాయుడు, దేవుదళ మాజీ ఎంపీటీసీ కెంబూరు కోటినాయుడు తదితరులతో కలిసి సచివాలయానికి చేరుకున్నారు. దేవుదళ వచ్చే రోడ్డులో ఈ వైన్ షాపు పెట్టడంతో దేవుదళ, పుర్లి, గోపింపేట వచ్చే ప్రయాణికులు, విద్యార్థులు, మహిళలు ఇబ్బందులు పడే అవకాశం ఉందన్నారు. ఇక్కడ మద్యం దుకానం ఏర్పాటు ప్రతిపాదనను విరమించుకోవాలని కోరారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు, ఎక్సైజ్‌శాఖకు తెలియజేస్తామని సచివాలయ సిబ్బంది తెలిపారు.



దేవుదళ సచివాలయ సిబ్బందికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

జాతీయ ప్రేరణ శిక్షణకు కంచరాం విద్యార్థిని

రాజాం సిటీ: మండలంలోని కంచరాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థిని పెనుభూతల సౌజన్య జాతీయ ప్రేరణ శిక్షణకు ఎంపికైందని హెచ్‌ఎం వీవీ వసంతకుమార్ శుక్రవారం తెలిపారు. ఏప్రిల్ నెలలో కిల్తంపాలెం జవహర్ నవోదయ విద్యాలయంలో జరిగిన జిల్లా స్థాయి ప్రేరణ పోటీలలో చక్కని ప్రతిభకనబరిచినట్లు చెప్పారు. జిల్లాలో ఇద్దరు విద్యార్థులను ఎంపిక చేయగా వారిలో సౌజన్య ఒకరని అన్నారు. ఈ నెల 20 నుంచి 26 వరకు గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్ సమీపంలోని వాడ్‌నగర్ ప్రేరణ పాఠశాలలో జరగనున్న జాతీయస్థాయి శిక్షణలో పాల్గొంటుందని తెలిపారు. దేశం నలుమూలల నుంచి ఎంపిక చేసిన విద్యార్థులకు వారం రోజులుపాటు ఆటలు, క్రీడలు, ఆయుర్వేద ఆహారం, ఆరోగ్యం, ఆర్కిటెక్చర్, వస్త్రాలకు సహజరంగులు ప్రింటింగ్ వేయడం, ఖగోళశాస్త్రం, విజ్ఞాన ప్రదర్శన, దృశ్యకళలు, భారతీయ పురాణాలు, ఇతిహాసాలు, సాంకేతికత, సృజనాత్మకత వంటి అంశాలపై శిక్షణా తరగతులు భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ నిర్వహించనుందని తెలిపారు. ఈమెకు ఎస్కార్ట్ టీచర్‌గా గణిత ఉపాధ్యాయిని తోట అరుణ వ్యవహరించనున్నారని అన్నారు. విద్యార్థిని ఎంపికపట్ల హెచ్‌ఎంతోపాటు ఉపాధ్యాయులు పండూరు వేణుగోపాల్, వెంకటరావు, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.



విద్యార్థినిని అభినందిస్తున్న హెచ్‌ఎం, తదితరులు

విద్యార్థులకు చాలీచాలని భోజనం



విద్యార్థులకు వడ్డిస్తున్న భోజనాన్ని పరిశీలిస్తున్న స్కూల్ కమిటీ చైర్మన్ శ్రీను, తదితరులు

రాజాం: పట్టణంలోని డోలపేట జెడ్పీ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన పథకం కింద విద్యార్థులకు సరిపడా భోజనం వండి పెట్టకపోవడంపై పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ రెడ్డి శ్రీను పథకం నిర్వాహకులను, పాఠశాల హెచ్‌ఎంను నిలదీశారు. శుక్రవారం ఆయన పాఠశాలను సందర్శించి ఎండీఎం మెనూను పరిశీలించారు. పాఠశాలలో మొత్తం 581 మంది విద్యార్థులు ఉండగా, భోజనాలకు 450 మంది హాజరౌతున్నట్లు రికార్డులో నమోదుచేశారు. భోజనాల సమయంలో విద్యార్థులు అందరికీ భోజనాలు చాలకపోవడంతో కొంతమంది విద్యార్థులు ఇంటిముఖం పట్టారు. దీంతో అక్కడే ఉన్న చైర్మన్ హెచ్‌ఎంను ప్రశ్నించి, ఉన్నతాధికారులకు ఫిర్యాదుచేశారు. చాలీచాలనీ భోజనాలు వడ్డించడంతో పాటు రుచి, శుచి ఉండడంలేదని ఆరోపించారు.

సంక్షిప్తంగా...

ఎస్సీలను అణగదొక్కడమే 'కూటమి'ధ్యేయం



సోరు సాంబయ్య

బొబ్బిలి: ఎస్సీలను అన్ని రంగాల్లోనూ అణగదొక్కడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని అంబేద్కర్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సోరు సాంబయ్య ఆరోపించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం తీసుకు వచ్చిన నూతన మద్యం పాలసీలో ఎస్సీలకు రిజర్వేషన్ లేకపోడం దారుణమన్నారు. కేవలం, అధికార పార్టీ నాయకులు, పెద్ద వ్యాపారాలు చేసే సిండికేట్లకు మాత్రమే ఈ మద్యం షాపులు దక్కేలా వ్యవహారాన్ని గుట్టుగా సాగించారని ఆరోపించారు. రిజర్వేషన్ ప్రకారం ఎస్సీలకు 15 శాతం దుకాణాలు కేటాయించాల్సి ఉందన్నారు. వెంటనే ప్రస్తుత టిండర్లను రద్దు చేసి కొత్త టిండర్లను ఎస్సీ రిజర్వేషన్లతో ప్రారంభించాలన్నారు.

లెప్రసీపై అవగాహన

రేగిడి: మండలంలోని ఉంగరాడ గ్రామంలో లెప్రసీ వ్యాధిపై శుక్రవారం అవగాహన కల్పించారు. శరీరంపై స్పర్శలేని రాగిరంగు మచ్చలు, కాళ్లు పూర్తిగా మూసుకోకపోవడం, చెవితమ్మలు మందంగా మారిపోవడం వంటివి లెప్రసీ వ్యాధి లక్షణాలని రేగిడి పీహెచ్‌సీ సూపర్‌వైజర్ అప్పారావు ప్రజలకు సూచించారు. జిల్లా వైద్యశాఖ ఆదేశాల మేరకు అన్ని గ్రామాల్లో లెప్రసీ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యశిబిరం

రేగిడి: రైతులు, ప్రజలు ఆరుబయట తిరిగే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని ఖండ్యాం ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారి ఎం.సునీల్‌కుమార్ సూచించారు. మండలంలో అంబకండి గ్రామంలో శుక్రవారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా 124 మందికి ఆరోగ్య తనిఖీలు చేసిన మందులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎస్.గోవిందనాయుడు, ఎంపీటీసీ పి.సత్యవతి, యోగా ఇన్‌స్ట్రక్టర్లు ఎం.రామకష్ణ, పి.శైలజ, ఎంఎల్‌హెచ్‌పీ కష్ణవేణి, హెల్త్ అసిస్టెంట్ పిల్లిరాజు తదితరులు పాల్గొన్నారు.

మూగజీవాలకు నట్టల నివారణ మందులు

తెర్లాం: గ్రామాల్లోని గొర్రెలు, మేకలన్నింటికీ తప్పనిసరిగా నట్టల నివారణ మందులు వేయాలని మండల సర్పంచ్‌ల సంఘ ప్రధాన కార్యదర్శి, కూనాయవలస సర్పంచ్ బోడెల విజయబాబు కోరారు. కూనాయవలసలో నట్టల నివారణ మందు వేసే కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రస్తుత సీజన్‌లో జీవాలు అంటువ్యాధుల బారిన పడతాయన్నారు. పశు వైద్యసిబ్బంది స్పందించి జీవాలకు నట్టల నివారణ మందుతో పాటు వ్యాక్సిన్లు వేసి పెంపకందారులను ఆదుకోవాలని కోరారు.

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం

- ఆర్డీఓ రామ్మోహనరావు

రామభద్రపురం: భూ సమస్యల పరిష్కారమే లక్ష్యమని ఆర్డీఓ జేవీవీఎస్ఎస్ రామ్మోహనరావు అన్నారు. మండలంలోని ఇట్లామామిడిపల్లిలో తహసీల్దార్ సులోచనరాణి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సును ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. గతంలో చేపట్టిన రీ సర్వేలో సాంకేతిక కారణాల వల్ల విస్తీర్ణం, పేర్లలో తప్పులు పడినా దరఖాస్తు చేసుకుంటే పరిష్కరిస్తామన్నారు. భూ రికార్డుల ప్రకారం అన్నీ సక్రమంగా ఉంటే వినతులు ఇచ్చిన 45 రోజుల్లో పరిష్కారమవుతాయని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు కరణం భాస్కరరావు, మండల సర్వేయర్ అక్కిన శ్రీనివాసరావు, సర్వే డీటీ ఉమామహేశ్వరి, సచివాలయ సర్వేయర్ సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు.



ఇట్లామామిడిపల్లిలో భూ సమస్యలపై రైతులతో మాట్లాడుతున్న ఆర్డీఓ రామ్మోహనరావు

అంటువ్యాధులు సోకకుండా చర్యలు

- ఎంపీడీఓ రామకృష్ణ

బాడంగి: మండలంలో డయేరియా వంటి అంటువ్యాధులు సోకకుండా వైద్యశాఖ, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ, పంచాయతీ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ ఆదేశించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సంబధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు డయేరియా సోకకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి గ్రామపంచాయతీలో రక్షిత మంచినీటి ట్యాంకులు శుభ్రం చేయాలని సూచించారు. అలాగే వర్షపు నీరు నిల్వలేకుండా చూడాలన్నారు. ఈ నెల 21 నుంచి తుఫాన్ హెచ్చరికలు ఉన్నందున రైతులు, ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. సమీక్షలో ఆయనతో పాటు ఈఓపీఆర్‌డీ సూర్యనారాయణ, పీహెచ్‌సీ వైద్యాధికాకారి సంతోష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శేఖర్ పాల్గొన్నారు.



సంబంధిత అధికారులతో సమీక్షిస్తున్న ఎంపీడీఓ రామకృష్ణ

ప్రైవేట్‌కు దీటుగా విద్యాబోధన

- ఎంఈఓ త్రినాథరావు

తెర్లాం: ప్రైవేట్ పాఠశాలలకంటే మెరుగైన విద్యాబోధన ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టాలని ఎంఈఓ జె.త్రినాథరావు అన్నారు. మండలంలోని సతివాడ ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల హోమ్‌వర్క్ పుస్తకాలు, చేతిరాత, ఉపాధ్యాయుల లెస్సన్ ప్లానింగ్, డైరీ, పాఠశాల రికార్డులు, మరుగుదొడ్లు, మధ్యాహ్న భోజనం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన చేపట్టాలన్నారు. అలాగే మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉండేలా స్కావెంజర్స్‌తో పని చేయించాలని, మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం పెట్టేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయనతో పాటు ఉపాధ్యాయులు చింత సత్యనారాయణ, తదితరులు ఉన్నారు.



సతివాడ పాఠశాలలో రికార్డులు తనిఖీ చేస్తున్న ఎంఈఓ త్రినాథరావు

మురుగునీటి శుద్ధి ప్లాంట్‌ను వేరే చోటుకు తరలించాలి...

బొబ్బిలి: మురుగునీటి శుద్ధి ప్లాంట్‌ను వేరే చోటుకు తరలించాలని పారిశుధ్య కార్మికుల సంఘ నాయకుడు పొట్నూరు శంకరరావు డిమాండ్ చేశారు. మూడు దశాబ్దాలుగా మున్సిపాలిటీలో శాశ్వత పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తున్న వారు తమకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరుతున్న ప్రాంతంలోనే ప్రభుత్వం ప్లాంట్ నిర్మించాలనుకోవడం తగదన్నారు. శుక్రవారం స్థానిక 30వ వార్డులోని పాకీవీధిలో మురుగునీటి శుద్ధి ప్లాంటు నిర్మాణ పనులు చేపట్టేందుకు మున్సిపల్ అధికారులు, సిబ్బంది సిద్ధమవుతుండగా పారిశుధ్య కార్మికులు అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న కమిషనర్ ఎల్. రామలక్ష్మి, సీఐ కె. సతీష్‌కుమార్ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ప్లాంట్‌ను వేరే చోటుకు తరలించి, తమకు ఆ ప్రాంతంలో ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కార్మికులు కోరారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని అధికారులు బదులిచ్చారు.



అధికారులు, పారిశుధ్య కార్మికుల మధ్య వాగ్వాదం

పంచాయతీలు పరిశుభ్రంగా ఉండాలి



గడిముడిదాం చెత్త సందప కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

రాజాం: పంచాయతీలు పరిశుభ్రంగా ఉండాలని ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు సూచించారు. మండలంలో గడిముడిదాం, ఆగూరు, పొగిరి తదితర గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు, క్లాప్ మిత్రలకు పలు సూచనలు చేశారు. చెత్త సేకరణ, కంపోస్టు తయారీ విధానంపై అవగాహన కల్పించారు.

మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి

రేగిడి: మహిళా సంఘాలు ఆర్థికంగా బలోపేతం కావాలని ఏపీఎం పి.గోవిందరావు అన్నారు. మండలంలోని ఆమదాలవలస గ్రామంలో శుక్రవారం గ్రామైఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా సంఘాల పొదుపు రికార్డులు పరిశీలించారు. పొదుపు నిల్వతో పాటు స్త్రీనిధి రుణాలు వినియోగం, చెల్లింపుపై ఆరాతీశారు. సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీసీలు, సీఎఫ్‌లు, మహిళా సభ్యులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఉచిత యోగా శిక్షణ

రాజాం సిటీ: ఈ నెల 20 నుంచి 29 వరకు ఉచిత యోగా శిక్షణ తరగతులు నిర్వహించనున్నామని యోగా గురువు టీటీవీ రమణమూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వికాసతరంగిణి ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ తరగతులు ఉదయం 5 గంటల నుంచి 6.30 గంటల వరకు ఉంటాయన్నారు. గాయత్రికాలనీ ఎదురుగా ప్రశాంతి నిలయం వద్ద నిర్వహించే ఈ శిక్షణలో 15 సంవత్సరాలు దాటిన స్త్రీ, పురుషులు పాల్గొనవచ్చునని సూచించారు.

రా.ర.వే సమావేశం రేపు

రాజాం సిటీ: స్థానిక విద్యానికేతన్ పాఠశాలలో ఈ నెల 20న రాజాం రచయితల వేదిక సమావేశం నిర్వహించనున్నామని వేదిక నిర్వాహకులు గార రంగనాథం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రౌతు గణపతిరావునాయుడు అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో 'వంశవృక్షం నవల-పరిశీలన' అనే అంశంపై పొదిలాపు శ్రీనివాసరావు ప్రసంగించనున్నారని అన్నారు. కార్యక్రమానికి సాహిత్యాభిమానులు, రచయితలు, కవులు, భాషాభిమానులు హాజరుకావాలని కోరారు.

బైక్ చోరీపై కేసు నమోదు

సంతకవిటి: మండల కేంద్రం సంతకవిటి గ్రామానికి చెందిన పొట్నూరు సంతోష్‌కుమార్ బైక్ చోరీకి గురైందని ఏఎస్సై ఎం.వాసుదేవరావు తెలిపారు. సంతకవిటి-హొంజరాం రహదారిలో ఉన్న తన ఇంటి వద్ద పార్కింగ్ చేసిన బైక్‌ను గురువారం అర్థరాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు అపహరించినట్లు సంతోష్‌కుమార్ ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

మగ్గూరులో నేత్ర వైద్య శిబిరం



శిబిరంలో తనిఖీలు నిర్వహిస్తున్న దృశ్యం

వంగర: మండలంలోని మెట్టమగ్గూరులో శుక్రవారం ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. శ్రీసూర్య మెడికల్ అండ్ జనరల్ స్టోర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో విజయనగరం శ్రీవేంకటేశ్వర పుష్పగిరి ఆస్పత్రి వైద్యులు రోగులకు తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. పలువురిని ఆపరేషన్లుకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో గ్రామీణ వైద్యుల సంఘం అధ్యక్షుడు ఉగిరి ముత్యాలు, తదితరులు పాల్గొన్నారు.